అక్షర దర్బార్
www.aksharadarbar.com
voice of the people
వెల ₹5
మంగళవారం 11, ఫిబ్రవరి 2025 | సంపుటి :02 | సంచిక :04 | పేజీలు :05


# రెడీ..



04

- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధం
- ఈనెల 15 తర్వాత నోటిఫికేషన్ !
- ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం
- రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ
- మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ దిశానిర్దేశం

## రాహుల్‌గాంధీ
# పర్యటన రద్దు



04

- పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో క్యాన్సిల్ !
- మధ్యాహ్నం వరంగల్ టూర్ షెడ్యూల్ ఖరారు
- నిరాశలో కాంగ్రెస్ శ్రేణులు

# కలిసి జీవించలేక..





- పురుగుల మందుతాగి జంట బలవన్మరణం
- ఆలం అశ్వినికి ఐదేండ్ల కిందటే వివాహం
- కొంతకాలంగా ఆలం స్వామితో సహజీవనం
- కులంలో పంచాయితీ పెట్టిన మొదటి భర్త
- పోలీస్ స్టేషన్‌లోనూ కేసు నమోదు !
- జరిమానా విధించిన పెద్ద మనుషులు
- భయం, మనస్థాపంతో ఇద్దరి ఆత్మహత్య
- ములుగు జిల్లా తుపాకులగూడెంలో ఘటన

03

## రాత్రయితే
# రాళ్ల వర్షం!

- భయాందోళనలో కాలనీవాసులు
- మానుకోటల్లోని వడ్డెరకాలనీలో ఘటన
- పరిస్థితిని సమీక్షించిన మహబూబాబాద్ టౌన్ సీఐ దేవేందర్

04






# పవర్ రెవెన్యూ

- ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరా చేసుకుంటున్న అక్రమార్కులు
- భూ కబ్జాదారులతో కొందరు రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు డీల్
- పట్టాదారు ఇంటిపేరు, పేరు పేరు కలిగిన వ్యక్తులను తెరపైకి తెచ్చి భూముల అక్రమ రిజిస్ట్రేషన్
- చనిపోయిన వారిని సైతం బతికి ఉన్నట్లు చూపుతున్న వైనం
- ఉన్నతాధికారుల చర్యలు లేకపోవడంతో అధికారాన్ని ఉపయోగించి బరితెగింపు

05

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామంలో ఓ వ్యక్తి వ్యవసాయ భూమిని అతనికి తెలియకుండానే రెవెన్యూ అధికారులు మరొకరి పేర రిజిస్ట్రేషన్ చేశారు. ఇక్కడేమి జరిగిందంటే భూమి పట్టాదారు ఇంటిపేరు, పేరు, తానే పట్టాదారునని మరొకరికి రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తి ఇంటిపేరు, పేరు ఒకటే. ఒక అవగాహన కుదరటంతో రెవెన్యూ అధికారులు ఈ అక్రమ భాగోతం నడిపినట్లు తెలిసింది. ఏడాదిన్నర క్రితం పథకం ప్రకారం ఇది జరిగింది. కొంతకాలం తర్వాత విషయం తెలియగా అసలు పట్టాదారు నెత్తినోరు బాదుకోవటంతో ఈ వ్యవహారం కొద్ది నెలల క్రితం వెలుగులోకి వచ్చింది. ఇదే మండలంలో ని మరో గ్రామంలో ఒకరి పేర ఉన్న వ్యవసాయ భూమిని రెవెన్యూ అధికారులు మరొకరి పేర అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన విషయం ఇటీవల బయటపడింది. దీనిపై ప్రస్తుతం వివాదం నడుస్తున్నట్లు తెలిసింది. ఇక్కడ వడ్లకొండ, ఇతర గ్రామాల్లో అక్రమార్కులతో డీల్ కుదుర్చుకొని ఒకరి భూమిని మరొకరి పేర తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసిన రెవెన్యూ శాఖలోని అధికారులు, ఉద్యోగులు ప్రస్తుతం ఇతర మండలాల్లో విధులు నిర్వహిస్తున్నారు.

– అక్షరదర్బార్, హనుమకొండ



# ఎమ్మెల్సీ రేసులో దొమ్మాటి

ఎమ్మెల్యేలతో దీపాదాస్ మున్షిని కలిసిన సాంబయ్య

05

# చిక్కుల్లేవ్



- రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా మేలు
- ఎస్సీ వర్గీకరణతో మాదిగ, మాదిగ ఉపకులాలకు లాభం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సీఎంను కలిసిన ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ
- జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికపై ప్రభుత్వానికి సూచనలు

04



నర్సింహులపేట మండలంలోని ఆకేరు వాగులో ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న ఎస్పీ రాంనాథ్ కేకన్

# ఆదేశాలు అమలయ్యేనా?

- ఉమ్మడి జిల్లాలో జోరుగా ఇసుక దందా
- వందలాది ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా
- ఆకేరు వాగులో అంతులేని తవ్వకాలు
- ఆ పోలీస్ స్టేషన్లకు కాసులు కురిపిస్తున్న వ్యాపారం
- అక్రమార్కులకు కొందరు ఖాకీల సహకారం !
- ఇసుక అక్రమ రవాణాపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్
- మాఫియాపై ఉక్కుపాదం మోపాలని కీలక ఆదేశాలు
- రంగంలోకి మానుకోట ఎస్పీ రాంనాథ్ కేకన్ ..
- నర్సింహులపేట మండలంలో ఇసుక ర్యాంప్‌ల పరిశీలన
- అక్రమ రవాణాను మానుకోవాలంటూ సీరియస్ వార్నింగ్
- ఇక్కడి నుంచి దాదాపు 600 ఇసుక ట్రాక్టర్లు పట్టణాలకు తరలింపు..!

అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఎలాంటి అనుమతులు లేకుండా ఆకేరు, పాలేరు, మోరంచ, యశ్వంతాపూర్, చలివాగు పరివాహక ప్రాంతాల్లో నుంచి అక్రమార్కులు వందలాది ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తూ లక్షల రూపాయలు గడిస్తున్నారు. ముఖ్యంగా ఆకేరు వాగులో తవ్వకాలకు అంతేలేదు. వర్ధన్నపేట, ఐనవోలు మండలాల్లో వాగు పరివాహక ప్రాంతంలో జేసీబీ యంత్రాలతో ఇసుకను తోడేస్తున్నారు. మానుకోట జిల్లా తొర్రూరు సబ్ డివిజన్ పరిధిలోని నర్సింహులపేట, నెల్లికుదురు, చిన్న గూడూరు మండలాల్లోని వాగు వరద ల్లోంచి ఇసుకను తోడుతూ రవాణా చేస్తున్నారు. ఇక్కడి నుంచి దాదాపు 600 ఇసుక ట్రాక్టర్లు పట్టణాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. వర్ధన్నపేట, మామునూరు ఏసీపీ పరిధి, తొర్రూరు సబ్ డివిజన్ పరిధి పోలీస్ స్టేషన్లలోని అధికారులకు ఈ అక్రమ ఇసుక దందా కాసులు కురిపిస్తోంది. ఈనేపథ్యంలో ఇసుక అక్రమ రవాణాపై సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గనులు, ఖనిజాభివృద్ధి శాఖపై రెడ్డి ఉన్నతస్థాయి సమావేశంలో అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని.. రీచ్‌ల వద్ద వెంటనే తనిఖీలు చేపట్టాలన్నారు. అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అయితే, ముఖ్యమంత్రి ఆదేశాలు అమలవుతాయా ? అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట పడుతుందా ? అనేది వేచి చూడాల్సిందే.

### సీఎం కీలక ఆదేశాలు

అక్రమార్కులను ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని, అవసరమైతే తానే స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పారు. బ్లాక్ మార్కెట్ అరికట్టి పేదలకు ఇసుక అందుబాటులో ఉండేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక రవాణా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. అందుకు జిల్లాల వారిగా కలెక్టర్లు, ఎస్పీలకు బాధ్యతలు అప్పగించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ పరిసరాల్లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే బాధ్యతను హైడ్రాకు అప్పగించారు. ఇందిరమ్మ ఇండ్లకు ఇసుకను ఉచితంగా అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సామాన్య వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ రవాణాకు సహకరించే అధికారులపై వేటు తప్పదని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

### అక్రమార్కులపై ఉక్కుపాదం..

#### మానుకోట ఎస్పీ రాంనాథ్ కేకన్

ఇసుక అక్రమ రవాణాపై మహబూబాబాద్ ఎస్పీ రాంనాథ్ కేకన్ ఉక్కుపాదం మోపుతున్నారు. ఎక్కడికక్కడ తనిఖీలు చేపడుతూ అక్రమార్కులను పరుగులు పెట్టిస్తున్నారు. నర్సింహులపేట మండలంలోని రామన్నగూడెం, కౌసల్యాదేవిపల్లి, ఫకీర తండా, బొజ్జన్నపేట, కొమ్ములవంచ గ్రామాల్లోని ఆకేరు వాగు నుంచి అనుమతులు లేకుండా కొంత మంది ఇసుక రవాణాకు పాల్పడుతున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ రాంనాథ్ కేకన్ స్వయంగా రంగంలోకి దిగారు. మంగళవారం ఇసుక రవాణా చేస్తున్న ర్యాంపులను తనిఖీ చేశారు. వాగులోకి దిగి ఇసుకను పరిశీలించారు. అనుమతి లేకుండా పిడికెడు ఇసుక బయటకు పోవొద్దు, అలసత్వం వహిస్తే వదిలేది లేదంటూ అధికారులను, సిబ్బందిని హెచ్చరించారు. ఇసుక మాఫియా సూత్రదారులు, పాత్రదారులు, పైరవీకారులు ఏ రంగంలో ఉన్నా, ఏ వృత్తిలో ఉన్నా సరే జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆఖరిసారిగా చెపుతున్నాం మీరు మారండి, ఇసుక అక్రమ రవాణాను మానుకోండి అంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ పర్యటనతో ఇసుకాసురులు వణికిపోతున్నారు. అంతకుముందు ఎస్సై సురేష్ మాట్లాడుతూ.. మండలంలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతులు లేకుండా పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ సుధీర్ కేకన్ ఆదేశాల మేరకు నరసింహులపేట మండలంలో అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో రాంరెడ్డి

## స్థానిక ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలి

### వరంగల్ జెడ్పీ సీఈఓ రాంరెడ్డి

అక్షర దర్బార్, దుగ్గొండి: పంచాయతీ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలని వరంగల్ జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి అన్నారు. మంగళవారం దుగ్గొండి మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దుగ్గొండి, నల్లబెల్లి ఎంపీడీవోలు అరుంధతి, నరసింహామూర్తి, పంచాయతీ అధికారి శ్రీధర్ గౌడ్, మాస్టర్ ట్రైనర్స్ కనకయ్య ,బాలాజీ రావు పాల్గొన్నారు.



భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ను సన్మానించి, వినతి పత్రం అందజేస్తున్న వాకర్స్

## మున్సిపల్ కమిషనర్ కు వాకర్స్ సన్మానం..

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ను మంగళవారం జిల్లా వాకర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పార్క్ లో సౌకర్యాలు కల్పించి, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు రొడ్డ రవీందర్, ఉపాధ్యక్షులు కటిక్కోజ్వల రాజు, ప్రధాన కార్యదర్శి కోలా తిరుపతిగౌడ్, కమిటీ సభ్యులు బిల్లా రాజిరెడ్డి, మూర్తి, రవి, శ్రీనివాస్ రెడ్డి లు ఉన్నారు.

## న్యాయం గెలిచింది

- పీఏసీఎస్ చైర్మన్ గా గుండెబోయిన నాగయ్య యాదవ్

అక్షర దర్బార్, పరకాల : పరకాల పీఏసీఎస్ చైర్మన్ గా గుండెబోయిన నాగయ్య యాదవ్ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో కొంతమంది రాజకీయ కుట్రలతో ఆయన పదవిని తొలగించడంతో న్యాయం కోసం చట్ట ప్రకారం ట్రిబ్యూనల్ కోర్టును ఆశ్రయించి మళ్లీ మంగళవారం పదవి చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయం గెలిచిందని, తనపై లేనిపోని అబండాలు వేసి రైతులకు దూరం చేసిన వారికి చెంపపెట్టుగా మళ్లీ కోర్టు తనకు న్యాయం చేసిందని తెలిపారు. తన జీవితాంతం రైతుల కోసమే కష్టపడతానని గుర్తు చేశారు. తన వెన్నంటి ఉన్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, బిఆర్ఎస్ నాయకులకు, రైతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాగయ్య యాదవ్ ను డైరెక్టర్లు, బిఆర్ఎస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, మాదారం పిఏసిఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, పిఏసిఎస్ డైరెక్టర్లు పంచగిరి శ్రీనివాస్,పిట్ట రమేష్, పద్మ ఎల్లయ్య, సునీత శంకర్, సీనియర్ నాయకులు బొచ్చు కుమార్, అరె సాంబ రెడ్డి, రత్నాకర్ రెడ్డి, మద్దెల బాబు, జీవన్ యాదవ్ పాల్గొన్నారు.



బాధ్యతలు చేపడుతున్న నాగయ్య యాదవ్

## హైవే భూముల పరిశీలించిన కలెక్టర్

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల వ్యవసాయ భూములను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం పరిశీలించారు. మొగుళ్ళపల్లి మండలం ఇస్సిపేట, రంగాపురం గ్రామాలలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే లో భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొగుళ్ళపల్లి మండలంలోని ఇస్సిపేట, రంగాపూర్, మేదర మెట్ల, మొగుళ్ళపల్లి గ్రామాల్లో సుమారు 8.78 కిలో మీటర్ల మేర నేషనల్ హైవే వెళ్తున్న క్రమంలో రైతుల నుండి భూసేకరణ చేపట్టామని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రైతులకు పరిహారం అందిస్తామన్నారు. రంగాపూర్ గ్రామ శివారులో 20 ఎకరాల విస్తీర్ణంలో రెస్ట్ పాయింట్ (పార్కింగ్ ఏరియా) ఏర్పాటు చేస్తున్నారని నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి దానిని ప్రభుత్వ భూమి ఉన్న చోటకు మార్చాలని రైతులు కోరగా నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి మార్పుటకు ప్రయత్నిస్తానని కలెక్టరు తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ హైవే పి.డి దుర్గా ప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఏ.డీ సునీల్, ఆర్డీఓ రవి, తహసీల్దార్ సునీత పాల్గొన్నారు.



భూనిర్వాసితులతో మాట్లాడుతున్న కలెక్టర్



# ఆకేరు వాగులో ఇసుక దొంగలు!

- ఎస్పీ ఆదేశాలను పట్టించుకోని అక్రమార్కులు
- మడిపల్లి శివారు ఆకేరు వాగులో యధేచ్ఛగా ఇసుక రవాణా

అక్షర దర్బార,తొర్రూరు : ఇసుక అక్రమార్కులపై కఠినంగా వ్యవహారించి, కేసులు నమోదు చేసి కట్టుదిట్టం చేయాలని అధికారులను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశించారు. తొర్రూరు డివిజన్ లోని చిన్నగూడూరు, నర్సింహులపేట మండలాల్లో పర్యటించి, జిల్లా పరిధిలో అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉదయం ఎస్పీ పర్యటించడంతో మధ్యాహ్నం తొర్రూరు మండలంలోని మడిపల్లి శివారు తొర్రూరు– మహబూబాబాద్ ప్రధాన రహదారి పక్కన ఆకేరు వాగు బ్రిడ్జి వద్ద అక్రమంగా ఇసుక తోలుతున్నారు. దీంతో మండలంలోని ప్రజలు అధికారుల ఆదేశాలు ఎవరు పట్టించుకోవడంలేదని చర్చించుకుంటున్నారు. ఇసుక మాఫియా చేసే వారిని ఎవరు అడ్డుకోలేరని అనుకుంటున్నారు.

# కిక్కే కిక్కు!

## అమల్లోకి మద్యం కొత్త ధరలు

అక్షరదర్బార్, హైదరాబాద్: మద్యం కొత్త ధరలు మంగళవారం నుంచే అమల్లోకి వచ్చాయి. మందుబాబులకు తెలంగాణ సర్కార్ బిగ్ షాకిచ్చిన సంగతి తెలిసిందే. అన్ని రకాల బీర్లపైనా ధరలను 15 శాతం పెంచుతున్నట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... నేటి నుంచి ధరలను 15 శాతం పెంచడానికి ఎక్సైజ్ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీ ఉత్తర్వ్యులు జారీ చేశారు. ధరల స్థిరీకరణ కమిటీ సిఫార్సుల మేరకు బీరు ధరలను పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీని ప్రకారం... ఐ.ఎం.ఈ.ఎల్. డిపోల వద్ద ఉన్న నిల్వలు, రన్నింగ్ లో ఉన్నవి మంగళవారం నుంచి సవరించిన ధరలను విక్రయించబడతాయని వెల్లడించారు.

| బీరు ప్రస్తుత | ధర – కొత్త ధర |
|---|---|
| కేఎఫ్ లైట్ – | 150 – 172.5 |
| కేఎఫ్ ప్రీమియం – | 160 – 184 |
| హేవార్డ్స్ – | 160 – 184 |
| టూబర్గ్ లైట్ – | 185 – 212.75 |
| కేఎఫ్ అల్ట్రా – | 210 – 241.5 |
| బడ్వైజర్ లైట్ – | 210 – 241.5 |
| కేఎఫ్ అల్ట్రా మ్యాక్స్– | 220 – 253 |
| బడ్వైజర్ మ్యాగ్నం – | 220 – 253 |
| టూబర్గ్ స్ట్రాంగ్ – | 240 – 276 |



# మీకింతా.. మాకింతా..!

- క్వారీల్లో ఆగని వసూళ్ల పర్వం
- చేతివాటానికి దాసోహమైన టీజీఎండీసీ సిబ్బంది
- సీఎం ఆదేశాలు బేఖాతర్ చేస్తున్న వైనం
- కన్నెత్తి చూడని సంబంధిత అధికారులు

అక్షరదర్బార్, కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని ఇసుక రీచుల్లో వసూళ్ల పర్వం ఆగడం లేదు.లోడింగ్ ఛార్జీల పేరుతో యథేచ్ఛగా అక్రమ వసూళ్లు జరుగుతున్న పట్టించుకునే నాథుడే లేకపోవడంతో క్వారీ కాంట్రాక్టర్లు రెచ్చిపోతున్నారు. ఆయా క్వారీల్లో ఒక్కో లారీకి రూ.2500 నుండీ రూ.3వేల చొప్పున లోడింగ్ ఛార్జీల పేరుతో కాంట్రాక్టర్లు బరితెగించి దోచుకుంటున్న సంబంధిత అధికారులు కనీసం కన్నెత్తి చూడట్లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.అయితే ఈ దందాకు ప్రధాన పాత్రదారులు టీజీఎండీసీ సిబ్బందినే అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.పట్టించుకోవాల్సిన టీజీఎండీసీ సిబ్బందే మీకింతా.. మాకింతా అన్న చందంగా క్వారీల్లో అక్రమ వసూళ్ల దందాకు సహకరిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ వసూళ్ల పర్వానికి సంబంధిత ఓ ఉన్నతాధికారి అండదండలున్నాయని సదరు అధికారికి వసూళ్లలో షేర్ ఉంటుందటూ బహిరంగ చర్చలు జరుగుతున్నాయి.

### - చేతివాటం ప్రదర్శిస్తున్న టీజీఎండీసీ సిబ్బంది

ఆయా క్వారీల్లో జరుగుతున్న అక్రమాలకు టీజీఎండీసీ సిబ్బందే ప్రధాన కారణమని సమాచారం. ప్రభుత్వంలోని ప్రధాన రాజకీయ నాయకుల అండదండలతో టీసీఎండీసీ సిబ్బందిగా చేరుతూ అక్రమాలకు సహకరిస్తూ వారికంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు.దీంతో ఆయా క్వారీల కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ప్రభుత్వ ఆదాయాన్ని గండికొట్టిస్తున్నట్లుగా తెలుస్తోంది. అయితే వారికొచ్చే జీతం వేలల్లోనే ఉంటుండగా అదిసరిపోదంటూ క్వారీల్లో అక్రమ దందాకు తెరలేపి లక్షల్లో సంపాదించుకున్నట్లుగా తెలుస్తోంది. ముఖ్యంగా మహదేవపూర్ మండల క్వారీల్లో పనిచేస్తున్న టీజీఎండీసీ సిబ్బంది ప్రశ్నించే వ్యవస్థను మేనేజ్ చేస్తూ షాడో కాంట్రాక్టర్లుగా వ్యవహరిస్తున్నట్లుగా ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దీంతో అక్రమ వసూళ్ల దందాలో వీరి భాగస్వామ్యం ఉంటుండగా కాంట్రాక్టర్లు రెచ్చిపోతున్న తీరు అనిర్వచనీయమనే చెప్పుకోవచ్చు.

### - సీఎం ఆదేశాలు బేఖాతర్..

ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, గనులు,ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్,సీఎస్ శాంతికుమారిలతో సమావేశం నిర్వహించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే ఎంతటివారైనా సరే ఉపేక్షించొద్దని ఇందుకోసం ఎలాంటి చర్యలైన తీసుకోవాలం టూ హెచ్చరికలు జారీచేశారు. అయితే జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో మాత్రం సీఎం ఆదేశాలు బేఖాతరు చేస్తూ కాంట్రాక్టర్లు రెచ్చిపోతున్న తీరు ఔరా అనిపిస్తున్నది.ఓ వైపు ఇసుక అక్రమాలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేసి ఒక్కరోజు కూడా గడవక ముందే టీజీఎండీసీ సిబ్బంది,కాంట్రాక్టర్లు సమన్వయంతో దందాకు తెరలేపగా పట్టించుకోవాల్సిన అధికార యంత్రాంగం మిన్నకుండిపోతున్నట్లుగా అందరూ చర్చించుకుంటున్నారు.

### అక్రమ వసూళ్లను అరికట్టాలి



మహదేవపూర్ మండలంలో ఏర్పాటైన ఇసుక రీచుల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని అలాంటి అక్రమ వసూళ్లను అరికట్టాలి. లోడింగ్ ఛార్జీల పేరుతో లారీ డ్రైవర్ల పై బెదిరింపులకు పాల్పడుతూ వసూళ్లు చేస్తున్నారు. లోడింగ్ డబ్బులు ఇవ్వకుంటే అసలు లోడింగ్ చేయట్లేదు.దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోగా వారికే సహకరిస్తున్నారు.ఇసుక విధానంపై సర్కారు వట్టి నీట మూటలేనని స్పష్టంగా అర్థమవుతున్నది.

—ఎండీ అలీంఖాన్, బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు, మహదేవపూర్

# కలిసి జీవించలేక..

- పురుగుల మందుతాగి జంట బలవన్మరణం
- ఆలం అశ్వినికి ఐదేండ్ల కిందటే వివాహం
- కొంతకాలంగా ఆలం స్వామితో సహజీవనం
- పంచాయితీ పెట్టిన మొదటి భర్త
- భయం, మనస్థాపంతో ఇద్దరి ఆత్మహత్య
- ములుగు జిల్లా తుపాకులగూడెంలో ఘటన




అక్షరదర్బార్, ములుగు: ములుగు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. పురుగు మందు తాగి ఇద్దరు బలవన్మరణాలకు పాల్పడ్డారు. కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆలం అశ్వినికి ఐదు సంవత్సరాల కింద వివాహం జరిగింది. అదే గ్రామానికి చెందిన ఆలం స్వామితో కొంతకాలంగా సన్నిహితంగా మెలుగుతోంది. ఈక్రమంలోనే ఇటీవల స్వామి ఇంటికి వచ్చి ఆయనతోనే ఉంటోంది. దీంతో మొదటి భర్త కుల పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టించాడు. రూ. 20 లక్షలు డిమాండ్ చేశాడు. మూడు లక్షల రూపాయలు కుల తప్పుగా ఇవ్వాలని పెద్దలు నిర్ణయించారు. మొదటి భర్త ఒప్పుకోకుండా పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టినట్లు తెలిసింది. ఈక్రమంలోనే ఆలం స్వామి నిన్న మద్యం తాగి ఇంటికి రావడంతో అశ్విని మందలించింది. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ రోజు ఉదయం పెద్ద మనుషుల పంచాయితీ ఉండటంతో మనస్థాపం చెందిన ఆలం స్వామి, ఆలం అశ్విని పురుగుల మందు సేవించారు. అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వాళ్లు అంబులెన్స్ లో ఏటూరునాగారం సామాజిక వైద్య శాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే ఇద్దరు మృతి చెందారు. మృతదేహాలకు వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.




మాట్లాడుతున్న తొర్రూర్ సీఐ గణేష్

# ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలే..

## తొర్రూరు,కేసముద్రం సీఐలు గణేష్, సర్వయ్య

అక్షర దర్బార్, తొర్రూరు/కేసముద్రం : మహబూబాబాద్ జిల్లా పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తొర్రూరు, కేసముద్రం సీఐలు గణేష్, సర్వయ్య మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పీడీపీపీ యాక్ట్, మైనింగ్ యాక్ట్ సెక్షన్ల కింద కేసుల నమోదుతో పాటు వాహనాలను జప్తు చేస్తామని హెచ్చరించారు. అక్రమ రవాణాపై 100 కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

మంగళవారం
11.02.2025
www.aksharadarbar.com

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

# చిక్కుల్లేవ్..


- రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా మేలు
- ఎస్సీ వర్గీకరణతో మాదిగ, మాదిగ ఉపకులాలకు లాభం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సీఎంను కలిసిన ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ
- జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికపై ప్రభుత్వానికి సూచనలు

అక్షరదర్బార్, హైదరాబాద్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ సిఫారసులను శాసనసభ ఆమోదించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ కలిశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, మాదిగ ఉపకులాల ప్రతినిధులతో కలిసి సీఎంతో సుమారు రెండు గంటలపాటు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు రాగానే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై అసెంబ్లీలో చర్చించామని గుర్తు చేశారు. రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా మేలు చేస్తామని, మాదిగ, మాదిగ ఉపకులాలకు మేలు చేసే లక్ష్యంతో ఉన్నామని పేర్కొన్నారు. కేబినెట్ సబ్‌కమిటీ, న్యాయకమిషన్ వేసి అధ్యయనం చేయించామని, వేగంగా నివేదిక తీసుకుని, కేబినెట్‌లో చర్చించి, అసెంబ్లీలో ప్రవేశపెట్టామని తెలిపారు. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా చేశామని అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసినందుకు రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యేలకు మందకృష్ణ మాదిగ ధన్యవాదాలు తెలిపారు. సీఎంతో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికపై రాష్ట్ర ప్రభుత్వానికి కొన్ని సూచనలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.


మందక్రిష్ణను సన్మానిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

# రాహుల్ గాంధీ పర్యటన రద్దు

- పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో క్యాన్సిల్ !
- మధ్యాహ్నం వరంగల్ టూర్ షెడ్యూల్ ఖరారు
- నిరాశలో కాంగ్రెస్ శ్రేణులు



అక్షరదర్బార్, వరంగల్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వరంగల్ పర్యటన రద్దైంది. సాయంత్రం వరంగల్ రావాల్సిన ఉన్న రాహుల్ గాంధీ, పార్లమెంటు సమావేశాల కారణంగా పర్యటనను రద్దు చేసుకున్నారు. మధ్యాహ్నం 2.45 గంటలకు ఢిల్లీ నుంచి సాయంత్రం 5 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకోవాల్సింది. అక్కడ నుంచి సాయంత్రం 5.15 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 6 గంటలకు వరంగల్ చేరుకోవాల్సింది. రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నేడు వరంగల్‌కు వస్తున్నారని ప్రచారం జరిగింది. రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి దీపాదాస్ మున్షీ కూడా రాహుల్ గాంధీతో సమావేశం అయ్యే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెప్పాయి. వరంగల్‌లో దాదాపు రెండు గంటల పాటు రాహుల్ గాంధీ ఉంటారని అనుకున్నారు. రాత్రి 7.45 గంటలకు వరంగల్‌లో తమిళనాడు ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో బయలుదేరి చెన్నై బయలుదేరి వెళ్లాల్సింది.


మంత్రి తుమ్మలకు వినతిపత్రం ఇస్తున్న రవీందర్ రెడ్డి

# అనుమతులివ్వండి

- తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి

అక్షరదర్బార్, హన్మకొండ: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కి కేటాయించిన 35 గుంటల స్థలానికి నామమాత్రపు లీజు రేటును నిర్ణయించి నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. ప్రధాన కార్యదర్శి కక్కిరాల రమేష్, సంయుక్త కార్యదర్శి కట్కూరి నాగభూషణంతో కలిసి హైదరాబాద్‌లోని కార్యాలయంలో మంత్రిని కలిశారు. వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులను వివరించి, గతంలో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కి కేటాయించిన 35 గుంటల స్థలానికి నామమాత్రపు లీజు రేటును నిర్ణయించి నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

# మక్క తోటపై అడవి పందుల దాడి

- రూ. లక్ష మేర పంట నష్టం

అక్షర దర్బార్, కాటారం: అడవి పందులు అన్నదాతలను ఆగం చేస్తున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం బోర్లగూడెం గ్రామానికి చెందిన అజ్మీర పూల్ సింగ్ నాయక్ చెందిన మక్క తోటపై దాడి చేసి పంటను ధ్వంసం చేశాయి. సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటన సదరు రైతుకు నష్టం కల్గించింది. అడవి పందుల దాడితో పంట ధ్వంసమై లక్ష రూపాయల మేర నష్టం జరిగినట్లు రైతు తెలిపారు. కాగా మంగళవారం వ్యవసాయ అధికారి శశివర్ధన్ అడవి పందుల దాడిలో ధ్వంసమైన పంట చేనును పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. దాదాపు 40 గుంటల మక్క చేనును అడవి పందులు ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. అడవి పందుల దాడిలో ధ్వంసమైన మక్క చేనును అటవీశాఖ అధికారులు పరిశీలించి నష్టపరిహారం ఇప్పించాలని బాధిత రైతు కోరుతున్నాడు.


ధ్వంసమైన మొక్కజొన్న చేను

# పలువురి నివాళీ..

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, పరకాల మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ అన్న సోదా రామ్ దత్ దినకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలు వేసి నివాళి అర్పించిన కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు సురేందర్ మోహరోలియా, సికింద్రాబాద్ లయన్స్ క్లబ్ చైర్మన్ ఆలోక్ కుమార్ జా, వాల్మీకి రాష్ట్ర అధ్యక్షులు రాజేష్, గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, బిల్డర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్రబెల్లి తిరుపతిరెడ్డి, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ, సోదా బాబూలాల్, సోదా బిషన్ దత్, పిఎసిఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, మాజీ జెడ్పిటిసి పత్తి ప్రభాకర్, పిట్ట దేవేందర్. కాంగ్రెస్ మండల అధ్యక్షులు కట్కూరీ దేవేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు కొయ్యాడ శ్రీనివాస్, మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి పాల్గొన్నారు.





# సురేష్ లాల్‌కు శుభాకాంక్షలు

అక్షరదర్బార్, కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం నూతన సంచాలకులుగా ప్రొఫెసర్ సురేష్ లాల్ నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం నుండి బాధ్యతలు చేపట్టారు. అనంతరం కేయూ పరిపాలన అధికారులు, అధ్యాపకులు, నాన్ టీచింగ్ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఉద్యోగులు ప్రొఫెసర్ సురేష్ లాల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# ఇసుక లారీలపై చర్యలేవి?

**బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్**



అక్షర దర్బార్,కాటారం: మహాదేవపూర్ మండలంలో ఇసుక రీచుల నుండి ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేకుండా నడుస్తున్న ఇసుక లారీలపై అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవట్లేదని కాటారం బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రామిళ్ల కిరణ్ ప్రశ్నించారు. కాటారం మండలకేంద్రంలో తోట రవి అనే వ్యక్తిని లారీ ఢీకొనగా కాళ్లు పూర్తిగా తొలగించారని ఆ లారీకి ఇన్సూరెన్స్ లేకపోవడం దారుణమని సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఇసుక లారీలను అదుపు చేయడంలో స్థానిక మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,అధికార యంత్రాంగం విఫలమైందని రామిళ్ల కిరణ్ విమర్శించారు.

# రాత్రయితే రాళ్ల వర్షం !

- భయందోళనలో కాలనీవాసులు
- మానుకోటలోని వడ్డెరకాలనీలో ఘటన
- పరిస్థితిని సమీక్షించిన మహబూబాబాద్ టౌన్ సీఐ దేవేందర్
- స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరణ



అక్షరదర్బార్, మహబూబాబాద్ : జిల్లా కేంద్రంలోని వడ్డెరకాలనీలో గత కొన్నిరోజులుగా రాత్రి 7 గంటల నుండి అర్ధరాత్రి 12 గంటల వరకు నలుదిక్కుల నుండి ఇళ్లపై రాళ్ల వర్షం కురుస్తున్నట్లు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇండ్లపై ఇలా రాళ్లు, మట్టి పెళ్లలు పడటంతో భయంతో వణికిపోతున్నారు. రాళ్ల భయంతో రాత్రంతా కంటి మీద కునుకు లేకుండా ఉంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాళ్లతోపాటు కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఇంటి ముందు పసుపు, కుంకుమ, ముగ్గులతోపాటు, కొబ్బరి కాయలు కొట్టి, దీపం వెలిగి ఉండడంతో మరింత భయాందోళనకు గురవుతున్నారు. కుటుంబాలతో సహా ఇంటికి తాళంవేసి కొందరు వలస వెళ్లిపోతున్నారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ఇవాళ కాలనీని సందర్శించారు. స్థానికులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిస్థితులను పరిశీలించి కాలనీవాసులకు ధైర్యం చెప్పారు.



- ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరా చేసుకుంటున్న అక్రమార్కులు
- భూ కబ్జాదారులతో కొందరు రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు డీల్
- పట్టాదారు ఇంటిపేరు, పేరు పేరు కలిగిన వ్యక్తులను తెరపైకి తెచ్చి భూముల అక్రమ రిజిస్ట్రేషన్
- చనిపోయిన వారిని సైతం బతికి ఉన్నట్లు చూపుతున్న వైనం
- ఉన్నతాధికారుల చర్యలు లేకపోవడంతో అధికారాన్ని ఉపయోగించి బరితెగింపు

# పవర్ రెవెన్యూ

**అక్షరదర్బార్, హనుమకొండ :**

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామంలో ఓ వ్యక్తి వ్యవసాయ భూమిని అతనికి తెలియకుండానే రెవెన్యూ అధికారులు మరొకరి పేర రిజిస్ట్రేషన్ చేశారు. ఇక్కడేమి జరిగిందంటే భూమి పట్టాదారు ఇంటిపేరు, పేరు, తానే పట్టాదారునని మరొకరికి రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తి ఇంటిపేరు, పేరు ఒకటే. ఒక అవగాహన కుదరటంతో రెవెన్యూ అధికారులు ఈ అక్రమ భాగోతం నడిపినట్లు తెలిసింది. ఏడాదిన్నర క్రితం పథకం ప్రకారం ఇది జరిగింది. కొంతకాలం తర్వాత విషయం తెలియగా అసలు పట్టాదారు నెత్తినోరు బాదుకోవటంతో ఈ వ్యవహారం కొద్ది నెలల క్రితం వెలుగులోకి వచ్చింది. ఇదే మండలంలో ని మరో గ్రామంలో ఒకరి పేర ఉన్న వ్యవసాయ భూమిని రెవెన్యూ అధికారులు మరొకరి పేర అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన విషయం ఇటీవల బయటపడింది. దీనిపై ప్రస్తుతం వివాదం నడుస్తున్నట్లు తెలిసింది. ఇక్కడ వడ్లకొండ, ఇతర గ్రామాల్లో అక్రమార్కులతో డీల్ కుదుర్చుకొని ఒకరి భూమిని మరొకరి పేర తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసిన రెవెన్యూ శాఖలోని అధికారులు, ఉద్యోగులు ప్రస్తుతం ఇతర మండలాల్లో విధులు నిర్వహిస్తున్నారు.

తాజాగా హనుమకొండ జిల్లా కమలాపురం మండలంలోనూ మరో అక్రమ భూభాగోతం వెలుగులోకి వచ్చింది. ఇండ్లు కలిగి ఉన్న నివేశన స్థలాన్ని రెవెన్యూ అధికారులు వ్యవసాయ భూమిగా రిజిస్ట్రేషన్ చేసి తమ రూటే సెప'రేట్' అనే రీతిలో ఎంచక్కా పట్టాదారు పాస్ పుస్తకాన్ని జారీ చేశారు. కొన్ని దశాబ్దాల నుంచి ఇండ్లు నిర్మించుకుని నివసిస్తున్న జాగకు పట్టాదారు పాసు బుక్ జారీ చేయడాన్ని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఆధారాలతో సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్యను కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. స్థానిక మాజీ ప్రజాప్రతినిధి ఒకరు, తహసిల్దార్ కలసి ఈ అక్రమానికి ఒడిగట్టారని చెప్పారు.

**- విచిత్ర ఘటన**

అంతకుముందు ఇదే హనుమకొండ జిల్లాలోని వివిధ మండలాల్లో రెవెన్యూ శాఖలోని కొందరు అధికారులు భూకబ్జాదారులతో మిలాకతై అనేక అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. కాజీపేట మండలంలో బతికే ఉన్న ఓ వ్యక్తి స్థానంలో రెవెన్యూ అధికారులు మరో వ్యక్తిని తెరపైకి తెచ్చి వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ కానిచ్చిన విషయం గతంలో సంచలనం కలిగించింది. అంతేకాదు రెండేళ్ల క్రితం కాజీపేట మండలంలోని రాంపూర్ గ్రామంలో విచిత్ర ఘటన చోటు చేసుకుంది. ఇక్కడ వ్యవసాయ భూమి పట్టాదారు చనిపోవడంతో అతడి స్థానంలో రెవెన్యూ అధికారులు పట్టాదారు ఇంటిపేరు కలిగిన ఓ మహిళను తెరపైకి తెచ్చి వారసురాలిగా రికార్డులు సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్ తతంగం నడిపించారు. ఈ వ్యవహారంలో వారసురాలిగా పేర్కొన్న మహిళకు భూమిపై హక్కులు కల్పించేందుకు చనిపోయిన వ్యక్తుల పేర్లను వాడారు. స్థానికంగా చనిపోయిన వారిలో పట్టాదారు ఇంటి పేరు కలిగిన నలుగురు వ్యక్తులను కనుగొని ఆ నలుగురు తమ వద్ద హాజరై అఫిడవిట్లు అందజేశారని, సక్సేషన్ ద్వారా హక్కులు కల్పించవచ్చని జిల్లా కలెక్టర్ కు ప్రతిపాదన పంపి ఆమోదం లభించగానే తమ అక్రమ భాగోతాన్ని కానిచ్చారు. ఆత్మలు సంతకాలు చేసి, సమాధులు సాక్ష్యంగా నిలిచిన ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారినట్లు తెలిసింది. ఇందుకు బాధ్యులైన తహసీల్దార్ సహా రెవెన్యూ అధికారులు ఇతర మండలాల్లో దర్జాగా విధుల్లో కొనసాగుతున్నారు. ధరణి పోర్టల్ లో ఉన్న లోసుగులను ఆసరాగా చేసుకుని అక్రమార్కులు తమ దందాలో దూసుకెళ్తున్నారు. బాధితులు మాత్రం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ న్యాయం కోసం గిరికీలు కొడుతున్నారు.

**- చర్యలు తీసుకుంటే...**

అక్రమాలు వెలుగులోకి రాగానే బాధ్యులైన రెవెన్యూ శాఖలోని  అధికారులు, ఉద్యోగులపై ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమిస్తే తిరిగి పునరావృతం కాకుండా అక్రమాలకు కొంతవరకైనా ఫుల్ స్టాప్ పడేదనే భావన బాధితుల నుంచి వినపడుతుంది. అక్రమాలు వెలుగులోకి వచ్చిన తర్వాత కూడా ఉన్నతాధికారుల స్పందన అంతంత మాత్రమే ఉంటుండటం, తూతూ మంత్రంగా విచారణలు సాగుతుండటం, బాధ్యులపై సస్పెన్షన్ వంటి చర్యలు ఉండకపోతుండటంతో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు. చర్యలు లేకపోవడంతో అక్రమార్కులు తమకు ఉన్న అధికారాన్ని ఉపయోగించి తమ దారి రహదారి అనే తరహాలో అక్రమాల పరంపర కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఉన్నతాధికారులను సైతం తప్పుదారి పట్టిస్తున్నారు. రేపటి సంచికలో రాంపూర్ భూ అక్రమ రిజిస్ట్రేషన్ వివరాలు.

## కుటుంబ కలహాలతో బలవన్మరణం

- బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య
- కుటుంబంలో గొడవలే కారణం
- భార్యతోపాటు ఆమె తరుపు బంధువులపై మృతుడి తల్లి ఫిర్యాదు
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- టేకుమట్ల మండలం వెలిశాలలో ఘటన



అక్షరదర్బార్, టేకుమట్ల: మానసిక వేధింపులు భరించలేక ఓ వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం మండలంలోని వెలిశాలలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. చిట్యాల మండలం కైలాపూర్ గ్రామానికి చెందిన చింతల రవి (48) టేకుమట్ల మండలం రామకృష్ణపూర్ (వి) గ్రామానికి చెందిన సునీతను వివాహం చేసుకున్నారు. 15 సంవత్సరాల నుండి వెలిశాలలో బజ్జీల బండి నడుపుకుంటూ ఇల్లు కట్టుకుని నివసిస్తున్నాడు. ఈ మధ్య తరుచూ భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గొడవలు ఆగకపోవడంతో  పోలీస్ స్టేషన్ వరకు వెళ్ళారు. దీంతో రవి భార్య తన తల్లి ఇంటికి వెళ్ళిపోయింది. ఈనెల 8 నుండి రవి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇండ్లలో వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదు. మంగళవారం ఉదయం వెలిశాల గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో రవి మృతదేహం కనిపించడంతో గ్రామస్తులు పోలీసులుకు, మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బావి లోంచి మృతదేహాన్ని తీసి భూపాపలపల్లికి పోస్ట్ మార్టం కోసం తరలించారు. భార్య సునీత, అత్తమామ ఆనందం, భాగ్యలక్ష్మి, మరదలు పూర్ణిమ, తోడల్లుడు రవి మానసికంగా వేధించడం వల్ల తీవ్ర మనోవేదనకు గురై బావిలో దూకి చనిపోయాడని మృతుడి తల్లి రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

## ఉప ఎన్నికలు ఖాయం

- స్టేషన్ ఘన్‌పూర్‌లో రాజయ్య గెలుస్తడు
- పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజలు బుద్ధిచెప్తరు
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాట్ కామెంట్స్
- ఎర్రవల్లిలో మాజీ సీఎంను కలిసిన తాటికొండ రాజయ్య

అక్షరదర్బార్, హైదరాబాద్: పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు ఖాయమని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఇవాళ ఎర్రవల్లి ఫామ్ హౌస్ లో కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ ఉప ఎన్నికలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ లో ఉప ఎన్నిక వస్తుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఓడిపోయి రాజయ్య గెలుస్తారని జోస్యం చెప్పారు. ఉప ఎన్నికల్లో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజలు బుద్ధి చెబుతారని కేసీఆర్ అన్నారు.

## ఎమ్మెల్సీ రేసులో దొమ్మాటి

- ఎమ్మెల్యేలతో దీపాదాస్ మున్షిని కలిసిన సాంబయ్య



అక్షరదర్బార్, వరంగల్ : టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య ఎమ్మెల్సీ రేసులో ఉన్నట్లు తెలిసింది. గత లోక్ సభ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశించి నిరాశకు గురైన ఆయన ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో దొమ్మాటి సాంబయ్య తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని పార్టీ నాయకత్వాన్ని కోరుతున్నట్లు తెలిసింది. ఆయన గత మే నెలలో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో వరంగల్ లోక్ సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశించారు. చివరి నిమిషంలో బీఆర్ఎస్ నుంచి కడియం కావ్య కాంగ్రెస్ పార్టీలో చేరటం, ఆమెకు వరంగల్ పార్లమెంటు స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిత్వం దక్కిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నిరాశ చెందవద్దని, భవిష్యత్తులో పార్టీ మంచి అవకాశం కల్పిస్తుందని నాయకత్వం దొమ్మాటి సాంబయ్యకు చెప్పినట్లు సమాచారం. దీంతో సాంబయ్యకు కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఏదేని అవకాశం కల్పించవచ్చనే చర్చ జరుగుతుంది. ఈ నేపథ్యంలో త్వరలో కొందరు ఎమ్మెల్సీల పదవీకాలం ముగిసిపోనుంది. దీంతో ఎమ్మెల్యేల కోటాలో కాంగ్రెస్ పార్టీ నుంచి దొమ్మాటి సాంబయ్య ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేల మద్దతును పొందే పనిలో దొమ్మాటి ఉన్నట్లు తెలిసింది. కొద్ది రోజుల క్రితం వరంగల్ పార్లమెంటు నియోజక వర్గం పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దొమ్మాటికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసినట్లు తెలిసింది. తాజాగా మంగళవారం హైదరాబాదులో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి దీపా దాస్ మున్షిని కూడా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలు సాంబయ్యకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కలిసినట్లు సమాచారం. వీరిలో స్టేషన్ గణపురం, పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట, పాలకుర్తి ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగరాజు, యశస్వినిరెడ్డితో పాటు దొమ్మాటి సాంబయ్య ఉన్నారు.

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA  RAJESHWER RAO, email : aksharadarbarnews@gmail.com, office No : 7680992278★ RNI NO. TELTEL/2022/81915